క్లుప్తంగా

నేడు పంచారామ క్షేత్రంలో దుర్గాష్టమి పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న మహిషాసురమర్దిని ఆలయంలో గురువారం దుర్గాష్టమి పూజలు నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఆషాడ మాసం, అష్టమిని దుర్గాష్టమి మహిషాసురమర్దిని అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. పూజలు అనంతరం అమ్మవారి అలంకరణ ఉంటుందని చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించు కొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆలయ పండితులచే పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

హర్యానాలో సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్



మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: హర్యానా, గురుగ్రామ్‌లో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సుకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఎంపిక అయినట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. 36 రాష్ట్రాల నుంచి చైర్‌పర్సన్లు హాజరవుతూ ఉండగా రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిక కాగా వారిలో సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ ఉన్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీఓ వచ్చిందన్నారు. జాతీయ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ మేరకు బుధవారం చైర్‌పర్సన్ అరుణ హర్యానా బయలుదేరారు.

బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఎవర్న సూరిబాబు అనారోగ్యానికి గురి కావడంతో ఇటీవల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే రాజప్పకు సూరిబాబు పరిస్థితిని వివరించారు. దాంతో సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు స్వీకరించారు. ఈ మేరకు చెక్కు రావడంతో గురువారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో బాధితుడికి రూ.40,400 చెక్కు అందజేశారు. హుస్సేన్‌పురం గ్రామ నాయకుడు చల్లా బుజ్జి తెలిపారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లక్ష్మణదొర

పిఠాపురం: స్థానిక 12వ అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణ దొర నియమితులయ్యారు. ఈయన ఈ బాధ్యతల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం జీవో ఆర్టీ నంబర్ 1099ను ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ విడుదల చేశారు. లక్ష్మణదొర నియామకంపై పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పోటీలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో బుధవారం ఆయా పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీతారామరాజు జీవిత విశేషాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 3.30 వరకు చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు క్విజ్ పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పోటీలను అనూష, అంజలి, జశ్విత, నమ్రత, ఐశ్వర్య, సాయి హర్ష, భాష నిర్వహించారు.

నేడు ఎస్వీ రంగారావు కళా స్రవంతి వార్షికోత్సవం

బోట్‌క్లబ్: ఎస్వీ రంగారావు కళా స్రవంతి 11వ వార్షికోత్సవం గురువారం స్థానిక దంటు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు సంస్థ ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నాట్యాచార్య ఎం.వీరమణ శిష్యబృందం నృత్య కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఎస్వీ రంగారావు రాష్ట్ర స్థాయి కళా పురస్కారాలను కర్రి ధర్మరాజు (హరి), పేర్నీడి సూర్యనారాయణకు అందజేస్తున్నట్టు చెప్పారు. ఎస్వీరంగారావు రాష్ట్ర స్థాయి రంగస్థల పురస్కారాన్ని విజయవాడకు నటి కుసుమ సాయి అందించనున్నారు. అనంతరం అచమనం నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం.. అనర్థం..

- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం
- పర్యావరణానికి పెను ముప్పు
- క్యాన్సర్ సోకే ప్రమాదం
- కానరాని అధికారుల పర్యవేక్షణ



పట్టణంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పెద్దాపురం: పాలిథిన్ కవర్ల వినియోగం నిత్యకృత్యంగా మారింది. మార్కెట్ నుంచి ఇంటికి ఏ వస్తువు తీసుకుపోవాలన్నా పాలిథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి పెను ముప్పు తెలిసినా, ప్రభుత్వం ప్లాస్టిక్‌ని వినియోగించకూడదంటూ నిషేధిత ప్రకటనలు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. వాటికి సంబంధించిన చట్టాలను అమలు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి కరువైంది.

వాతావరణంలో మార్పులు

పాలిథిన్ సంచులను వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. విచ్చలవిడిగా పడవేసిన పాలిథిన్ సంచులు భూమిలో కలవకపోవడంతో అలాగే అందులోని రసాయన పదార్థాలు భూమిలో చేరి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అంతేగాక సకాలంలో వర్షాలు కురిసే అవకాశాలు మృగ్యమవుతున్నాయి.

రోగాల బారిన ప్రజలు

పాలిథిన్ వినియోగం వల్ల అనేక రకాల రోగాలు సోకే ప్రమాదముంది. ఈ కవర్లలో క్యాన్సర్ కారక రసాయన పదార్థం ఉంటుంది. ఈ పదార్థం క్యారీ బ్యాగుల్లో మనం తీసుకువెళ్లే వస్తువుల్లో కలిసిపోతుంది. దీని వలన పాలిథిన్ సంచుల్లో తీసుకువచ్చే ఆహార పదార్థాలు తినడం వలన మన శరీరంలోకి క్యాన్సర్ కణాలు తయారవుతాయంటున్నారు వైద్యులు చెబుతున్నారు. ఇరవై మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే పాలిథిన్ కవర్లను వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తూనే ప్రకతిలోని గాలి, నీరు, మట్టి వంటి వాటికి ఈ పాలథిన్ కవర్ల వలన తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. ప్రజలు వాడి పడవేసిన క్యారీ సంచుల నుంచి ప్రమాదకరమైన డాయక్సిన్ విడుదలై శ్వాసకోస వ్యాధుల బారిన ప్రజు పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటి నియంత్రణకు చేసిన చట్టాలను అధికారులు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంతంత మాత్రంగానే దాడులు

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై సంబంధిత అధికారులు అంతంతమాత్రంగానే దాడులు నిర్వహిస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, ఆయా గ్రామాల్లో మాత్రం ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టి పూర్తి ప్లాస్టిక్ రహిత, గ్రామాలుగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలను చైతన్యపరచాలి



పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తతంగా ప్రచారం చేసి, ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన ఆవసరం ఉంది. వీటి నియంత్రణకు ప్రభుత్వం చేసిన చట్టాలను అధికారులు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– వట్టికూటి రాజుకుమార్, దివిలి, పెద్దాపురం మండలం

ఆరోగ్య సమస్యలు వస్తాయి



పాలిథిన్ క్యారీ బ్యాగులు వినియోగించడం వలన వాటిలోని ప్రమాదకరమైన రసాయనాల వలన ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగంపైన ప్రజలు ఎవరికివారే చైతన్యం కావాలి.

– డాక్టర్ జగదాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

విద్యార్థుల పక్షపాతి అనంతరావు

ఎమ్మెల్సీ గోపీమూర్తి



అనంతరావు సన్మాన సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

పెద్దాపురం: ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక సంక్షేమ పక్షపాతి అనంతరావు అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పి.గోపిమూర్తి అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ భవనంలో బుధవారం జేవీవీ నాయకులు, యూటీఎఫ్ సీనియర్ కార్యకర్త బి.అనంతరావు స్వచ్ఛంద పదవీ విరమణ సభ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జాన్ కెనడీ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన ఘనత అనంతరావుదన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి విద్యార్థులు సైన్స్ ఫలాలు అందించి సమున్నత కృషి చేశారన్నారు. జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ ఉద్యమాలకు అండగా నిలబడడం వారితో కలిసి పనిచేయడం అనంతరావు గొప్పతనమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర వర్మ, జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు కేఎం ఎంఆర్ ప్రసాద్, రవివర్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, నగేష్, యూటీఎఫ్ మండల కార్యదర్శి శివశంకర్, సీఐటీయూ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, దాడి బేబీ తదితరులు పాల్గొన్నారు.





వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ యువజన విభాగాం రాష్ట్ర సంయుక్త సహాయ కార్యదర్శి కరణం భాను కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువజన విభాగం ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పిఠాపురం గ్రామానికి చెందిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

– సామర్లకోట, పిఠాపురం

ఉత్తములుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



విశ్రాంత ఉపాధ్యాయిని రమణి దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

- మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్
- విశ్రాంత ఉపాధ్యాయినికి ఘనంగా సత్కారం

కొత్తపల్లి: విద్యార్థుల ఉన్నతి కోసం పరితపించి, వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. ఎండపల్లి రాఘవేంద్రనగర్ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసిన మహంతి రమణి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సురక్షా పేలస్‌లో సన్మాన సభను బుధవారం ఏర్పాటు చేశారు. మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రమణి దంపతులను మండల విద్యాశాఖధికారులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృతుల కంటే గొప్పదన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంతో పాటు వారి నడవడికను మార్చేది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. చిన్నప్పుడు పాఠాలు చెప్పిన విద్యార్థులు అనేక పరిశ్రమలు, ఉన్నత ఉద్యోగాలు, రాజకీయ నాయకులై మాస్టారు అని పలకరిస్తే ఆ ఆనందం చెప్పలేనిదన్నారు. ఈ ఉపాధ్యాయ వృత్తిలో పదవి విరమణ పొందినపుడు జరిగే సత్కారాలు మరే ఇతర వృత్తులలోను పొందలేమన్నారు. ఎంఈఓ-2 జి.పైడిరాజు, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి గణేశ్వరరావు, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు గీసాల రాజు, ప్రధాన కార్యదర్శి తేజేశ్వరావు, కోశాధికారి వీరబాబు, యూటీఎఫ్ నాయకులు జోకా ప్రసాద్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కోటి అబ్బులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

- చంద్రంపాలెంలో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



చంద్రంపాలెంలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

సామర్లకోట: ప్రధాన రోడ్డు మార్జిన్‌లో గొయ్యి ప్రమాదకరంగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. చంద్రంపాలెం పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్ కోసం నాలుగు నెలల క్రితం గొయ్యి తీసి వదిలేశారు. అప్పటి నుంచి గొయ్యిని పూడ్చకపోవడంతో చిన్న వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ రోడ్డులో నడిచి వెళ్లే పిల్లలు ప్రమాదాలబారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగానే ఉన్న గొయ్యిపై పంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో గ్రామ ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి గొయ్యి పూడ్చి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలమైన కల్వర్టు

- ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- కౌన్సిల్ ఆమోదం లేనిదే జరగని పనులు



పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శిథిలమైన కల్వర్టు

సామర్లకట: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుకు సంబంధించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక లోడ్ ట్రాక్టరు ఈ కల్వర్టు మీదుగా వెళ్లడంతో డ్రైనుపై ఏర్పాటు చేసిన శ్లాబ్ రాళ్లు విరిగి పోయిన్నట్టు స్థానికులు తెలిపారు. దాంతో రోడ్డులో రాకపోకలు చేయడానికి ఇబ్బందికరంగా మారిందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం సైకిల్, మోటారుసైకిళ్లు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉందని, కార్లు, ఆటోలు రాకపోకలకు అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శిథిలమైన కల్వర్టు సమీపంలోని రోడ్డులో ఒక ప్రైవేటు పాఠశాల ఉంది. ఆ పాఠశాలకు విద్యార్థులు ఆటోలు, రిక్షాలు, సైకిళ్లపై రాకపోకలు చేస్తూ ఉంటారు. కల్వర్టు శిథిలం కావడంతో పాఠశాలకు చేరుకొనే ఆటోలు రెండు కిలోమీటర్లు తిరిగి రావలసి ఉంటుంది. దీనివల్ల పిల్లలు ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మున్సిపాలిటీ పనులు చేయడానికి అధికారులు గుర్తించినా దానికి కౌన్సిల్ ఆమోదం పొందాల్సి ఉంది. గత రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరుగకపోవడంతో పట్టణ పరిధిలో అభివృద్ధి పనులు కుంటుపడిపోయాయని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సమయంలో ఈ కల్వర్టు నిర్మాణం ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని దాతలు ముందుకు వచ్చి తాత్కలికంగా శ్లాబ్ రాళ్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కెరటాల్లో కొట్టుకొచ్చిన కొబ్బరికాయలు





ఉప్పాడ తీరంలో ఒడ్డుకు కొట్టుకు వచ్చిన కొబ్బరి కాయలు

పిఠాపురం: ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాల్లో కొబ్బరికాయలు కొట్టుకు రావడం చర్చనీయాంశంగా మారింది. కెరటాల్లో చేపలు కొట్టుకు రావడం మాత్రమే చూసే జనం కొబ్బరికాయలు కొట్టుకు రావడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. కొబ్బరి కాయలు ఎక్కడి నుంచి కొట్టుకొచ్చాయో తెలియక సముద్రంలో కొబ్బరికాయల లోడుతో వెళుతున్న ఓడ నుంచి పడి ఉంటాయని భావించారు. కాని పిఠాపురంలో ప్రముఖ దత్త దేవాలయాల్లో ఔదంబరీ వృక్షానికి మొక్కుకుని కొబ్బరి కాయలు కట్టడం ఆనవాయితీగా వస్తుంది. అలా కట్టిన కొబ్బరి కాయలను భద్ర పరచి సముద్రంలో కలుపుతుంటారు అలా కలిపిన కాయలే ఒడ్డుకు కొట్టుకు వచ్చినట్టుగా భావిస్తున్నారు. ఏది ఏమైనా కెరటాల్లో కొబ్బరి కాయలు వస్తున్నాయన్న సంగతి తెలిసి పర్యాటకులు స్థానికులు వాటిని చూసేందుకు ఎగబడ్డారు.

వైద్య దంపతుల దాతృత్వం



బీటెక్ విద్యార్థిని నందితకు ఆర్థిక సాయం అందజేస్తున్న వరప్రసాద్ దంపతులు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌కు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ ఆయన సతీమణి డాక్టర్ సురేఖలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వీరి కుమారుడు కాశ్విన్ పుట్టిన రోజు సందర్భంగా సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో చదువుతున్న బీటెక్ సెకండ్ ఇయర్ విద్యార్థిని నందిత చదువుకు ఆర్థిక సాయాన్ని అందించారు. శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వేదికగా రూ.25వేల మొత్తాన్ని సంస్థ వ్యవస్థాపకుడు డా.బొళ్లం సతీష్ ఆధ్వర్యంలో కుమారుడు అశ్విన్ చేతుల మీదుగా అందజేశారు. కాకినాడ గ్లాస్‌హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరప్రసాద్ మాట్లాడారు. దుర్గాసోము ప్రసాద్ చారిటబుల్ ట్రస్టీలు సోము స్వాతి, రాజ్‌కుమార్, బాబు పెరల్స్ అధినేత హరీష్ దీపిక దంపతులు కర్రి శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

21న ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ కరప యూనిట్‌కు ఎన్నిక

కరప: ఈ నెల 21వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ పరిధిలోని కరప యూనిట్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ ఎన్నిక స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల అధికారి, ఏపీఎన్‌జీఓ కాకినాడ పట్టణ యూనిట్ అధ్యక్షుడు ఎ.సత్తిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎన్‌జీఓ అసోషియేషన్ కరప యూనిట్ పరిధిలో కరప, కాకినాడ రూరల్ మండలాలు, ఏపీఎస్పీ కార్యాలయం, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసు, పండూరు పీహెచ్‌సీ ఏరియాలలోని ఎన్‌జీఓలు సభ్యులు ఉంటారన్నారు. ఎన్నికల ప్రక్రియ, కరప యూనిట్ ఎన్నికల అధికారిగా తనను, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కాకినాడ పట్టణ కార్యదర్శి డి.రామమూర్తిని, ఎన్నికల పర్యవేక్షణాధికారిగా జిల్లా సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావులను ప్రకటించారన్నారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎన్‌జీఓలు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 10న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ, 21న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎలక్షన్ జరుగుతుందని ఎన్నికల అధికారి సత్తిరాజు తెలిపారు. ఆయా మండల కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ ఉంచామన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మ ధ్వంసం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నేతలు

పిఠాపురం: పట్టణ పరిధిలో 8వ వార్డు డ్రైవర్స్ కాలనీలో వైఎస్సార్ సీపీకి చెందిన జెండా దిమ్మ, శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు రావుల మాధవరావు, ఉలవల భూషణం, బోనాసుల శివ, పెదపాటి రాజేష్, చింతాడ నీలవేణి, పిఠాని కాశీ, కౌన్సిలర్లు తలిశెట్టి వెంకటేశ్వరరావు, బొజ్జా రామయ్య, కొత్తెం దత్తుడు, బోను దేవ, పచ్చిమళ్ల అప్పలరాజు, లలిత, ముమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టారు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ



శ్రీనివాసు చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ తదితరులు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పని చేసి ఇటీవల బదిలీల్లో రామచంద్రపురం వెళ్లిన ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాంతో విషయం తెలుసుకున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బుర్ర గోపి మూర్తి బుధవారం సాయంత్రం పరామర్శించారు. శ్రీనివాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, అతని కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. యూటీఎఫ్‌తో పాటు ఎమ్మెల్సీగా తాను అందుబాటులో ఉంటానని ఎటువంటి సమస్య వచ్చినా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి సీతారామయ్య, జిల్లా పత్రిక కన్వీనర్ పి గిరిధర్ గోపాల్, ఉపాధ్యాయులు కెవీవీ సత్యనారాయణ, డి వీరన్నలు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏలో 40 మందికి బదిలీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న పీటీఐ, సీఆర్‌పీ, ఎంఐఎస్, డేటా ఎంట్రీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో 61 మంది ఉద్యోగులు పాల్గొనగా 40 మంది అభ్యర్థులకు వారు కోరుకున్న చోటుకు బదిలీ ఉత్తర్వులు అందజేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ పొండర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ బుధవారం తెలిపారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పడేవిధంగా అసలైన లబ్ధిదారులకు ఆ ఫలాలు అందకుండా జరుగుతున్న తాత్సరాలకు ప్రైవేట్ పాఠశాలలను బాధ్యలను చేయడం తగదని, ఈ నిరసనకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్ర మైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా మంగళవారం స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి వారికి ఉత్తరా నక్షత్రం సందర్భంగా విశేస పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠకు ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, ఉదయభానోజీరావు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ క్రైం: స్థానికంగా ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 42 పోస్టులు భర్తీ కానుండగా వాటిలో 29 గ్రామీణ, 13 పట్టణ ప్రాంతాలున్నాయి. నెలకు రూ.10వేలు గౌరవ వేతనం, పదో తరగతి ఉత్తీర్ణులైన 25–40 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జ్బుజుజీ ౖచ్ఛీ్చ ఇజౌ ఠి.జీ ౖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని అనంతరం డౌన్‌లోడ్ చేసి, నిర్ణీత సర్టిఫికెట్ల నకళ్లను జతజేసి ఈనెల ఏడో తేదీ నుంచి 9వ తేదీ సాయంత్రం 5 వరకూ అర్బన్ ప్రాంతానికి చెందిన వారు తమ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు గ్రామ పరిధిలో ఉన్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు అందజేయాలన్నారు.